
# తెలిసి చేసిన తప్పు!

– జి. ఉషాలత




వనజకి కబురు అంది, ఆ గుమ్మంలో అడుగు పెట్టేసరికి అంతా అయిపోయింది. వెంకట్రామయ్య మృత శరీరంమీద పడి రుక్మిణమ్మ, పిల్లలు ఘొల్లుమని యేడుపులు లంకించుకున్నారు. ఆ దృశ్యం చూసిన వనజకి హఠాత్తుగా తన కాళ్ళ క్రింది భూమి జరిగిపోతున్నట్టూ, తనేదో అగాధాల్లోకి పడిపోతున్నట్టూ అనిపించింది. ఆ గోలకి బెంబేలెత్తిపోయి భయంతో యేడుస్తూ చేతుల్లోనించి జారిపోతున్న యేడాది కొడుకుని పొదివిపట్టుకుని నిస్సత్తువుగా గోడకి జేరబడిపోయిన ఆమెని యెవరూ ఆ గందరగోళంలో గమనించలేదు. గమనించిన-కొద్దిమందీ ఆమెని గురించి పట్టించుకోలేదు. బంధువులు, స్నేహితులు, యిరుగు పొరుగులూ అందరూ రుక్మిణమ్మనీ, పిల్లల్ని వూరడించడంలోనే మునిగిపోయారు. రుక్మిణమ్మ చూసి వుంటే వనజని గుర్తుపట్టి అంతదుఃఖంలోనూ నాలుగు శాపనార్థాలు పెట్టి తన కడుపు మంటని చల్లార్చుకుని వుండేదేమోగాని, ఆవిడ తన బాధలో వనజ రాకని గమనించలేదు. ఒక గంట గడిచాక గాని వాళ్ళ దుఃఖావేగం చల్లారలేదు. అందరికంటే ముందు తేరుకున్నది వెంకట్రామయ్య పెద్దకొడుకు ఇరవైయ్యేళ్ళ రవి! ఎవరో అతన్ని ఓదార్చి జరగవలసిన కార్యక్రమం గురించి హెచ్చరించారు. రావలసిన బంధువులకి కబుర్లు వెళ్ళాయి. ఎవరో వనజని గురించి జ్ఞాపకం చెయ్యగానే అందరి కళ్ళూ అదే గదిలో వారగా నిల్చుని వున్న వనజ మీద పడ్డాయి.

"అదిగో! వచ్చిందిగా!" "పాపం! చిన్నదే! ఈ వయసులో ఆయనకి యెలాంటి బుద్ధి పుట్టిందో చూడు!" "రుక్మిణమ్మ పాపం! ఇన్నాళ్ళూ కొంగున నిప్పు కట్టుకుని బ్రతికింది." "కొడుకు వున్నట్టున్నాడు! ఆ స్తిలో వాటా అడుగుతుందిగామోసు!" "ఆఁ! ఆస్తా? పాడా? ఈ రోజుల్లో ఒ స్త్రీలో రెండు సంసారాలు సంబాళించడమంటే మాటలా? ఉన్న ఆస్తి కాస్తా, ఈయనెప్పుడో కరగబెట్టేశాడు." అందరూ తలోరకంగా మాట్లాడుకుంటున్నారు.

కొందరు వనజని చూసి జాలిపడితే, కొందరు వనజని చూసి ఛీత్కరించుకున్నారు. ముఖ్యంగా ఆడవాళ్ళెవరూ పలకరించను కూడా లేదు. అందరితో పాటు, ఎవరో ఆమెకీ కాఫీగ్లాసు అందించారు. పిల్లలందరితోపాటూ ఆమె కొడుక్కి కూడా బిస్కట్లు, పాలు అందాయి. వనజ అలా కళ్ళప్పగించి చూస్తూ వుండగానే జరగవలసిన కార్యక్రమం అంతా జరిగిపోయింది. వెంకట్రామయ్యగారి భౌతిక కాయం కనుమరుగు అయిపోయింది. వనజ నిద్రపోతున్న కొడుకుని భుజాన వేసుకుని గడప దాటింది. లోకంలోని వంటరితనమంతా ఆమెని చుట్టుముట్టినట్టయింది. ఎలాగో యిల్లు చేరిన వనజ భోరున యేడుస్తూ కుప్పకూలిపోయింది,

*

పెళ్ళికాక ముందు వనజ భూషణంగారి బట్టల

కొట్లో సేల్స్ వుమన్‌గా పనిచేసేది. ఆమెకి ఆ వుద్యోగంలో పెద్ద ఆసక్తి లేకపోయినా తన చదువుకి అంతకంటే మంచి వుద్యోగం వచ్చే అవకాశం లేదుగనుక యింట్లో వదినగారి ధుమ, ధుమలు, అన్నగారి రుసరుసలు తప్పించుకోవాలి గనకే, తప్పని సరై యెలాగో కాలం గడిపేసేది. వనజ తల్లి ఆమె చిన్నతనంలోనే పోయింది. ఆమె తొమ్మిదోక్లాసులో వుండగా తండ్రిపోయాడు. అప్పటికే ఆమె అన్నకి పెళ్ళయి, వదినగారు కాపరానికి వచ్చింది. ఇంట్లో చికాకులతో వనజ చదువు ఆగిపోయింది. అందం, డబ్బు, చదువు లేని ఆడపిల్లల జీవితం యెలాంటి ఒడిదుడుకులతో గడుస్తుందో అలాగే వనజ జీవితం గడిచింది.

ఇంట్లో ఆమె పెళ్ళిగురించిగాని, జీవితాన్ని గురించిగాని పట్టించుకున్నవాళ్ళు లేరు. తనని గురించి, తన భవిష్యత్తు గురించి పట్టించుకోవల్సింది తనుమాత్రమేననే సత్యం వనజకి తెలిసి వచ్చేనాటికి ఆమె వయస్సు పాతిక దాటిపోయింది. అప్పుడే ఆమెకి భూషణంగారు జ్ఞాపకానికి వచ్చేరు. వనజ తండ్రి యేనాడో చేసిన వుపకారానికి ప్రతిఫలంగా ఆమెకి ఆ వుద్యోగం దొరికింది. వనజకి భవిష్యత్తుమీద పెద్ద ఆశలేం వుండేవికావు. ఆశలు వుండటానికి అవకాశం లేని జీవితం ఆమెది! తను అందమైనది కాదని ఆమెకి తెలుసు. ఏ రాజకుమారుడూ తనని వరించి వస్తాడనిగాని డబ్బే లోకంగా వున్న అన్నగారు తనకి పెళ్ళి చేస్తారనిగాని ఆమె ఆశలు పెట్టుకోలేదు. జీవితాన్ని బరువుగా, భారంగా గడిపేస్తున్న రోజుల్లోనే ఆమె జీవితంలోకి వెంకట్రామయ్యగారు వచ్చారు. ఆయన భూషణంగారికి స్నేహితుడు. తీరిక దొరికినప్పుడల్లా భూషణంగారితో బాతాఖానీ కొట్టడానికి వచ్చే వెంకట్రామయ్య దృష్టి వనజ మీద పడింది. ఆమెలో ఆయన యేం చూసి ఆకర్షింపబడ్డాడో తెలీదుగాని వనజతో తరుచు మాటలు కలపడానికి ప్రయత్నించేవాడు. మొదట్లో వనజ అంతగా పట్టించుకోలేదు. వెంకట్రామయ్య తన కోసమే తరుచూ భూషణంగారి కొట్టుకి వస్తున్నట్టు కనిపెట్టగానే ఆమె గుండెలు ఝల్లుమన్నాయి. ఆయన చనువు తీసుకుని అడుగు ముందుకి వేసిననాడు ఆమె బలహీనమైన మనసు, ప్రకృతి సహజమైన కోరికలతో వేగిపోతున్న తనువూ యెదురు తిరగలేదు. వెంకట్రామయ్య ముగ్గురి పిల్లల తండ్రీ, యాభయ్యో పడిలో పడినవాడూ అయితే అవుగాక, తనని కావాలనుకున్నాడు! అంతే చాలు! అనుకుంది. వెంకట్రామయ్య ఆమెకి అన్యాయం చెయ్యలేదు. గుడికి తీసుకెళ్ళి తాళి కట్టేడు. చిన్న యిల్లు, అద్దెకి తీసుకుని ఆమెతో కాపరమూ పెట్టాడు. ఆ సంగతి ఆయన చుట్టపక్కాలకీ, పిల్లలకీ, భార్యకీ అందరికీ తెలుసు.

ఆయన భార్య రుక్మిణమ్మ యేడిచీ, మొత్తుకునీ, వనజనీ, ఆమె వంశాన్ని నాలుగు శాపనార్థలు పెట్టి, నోరు నెప్పెట్టి వూరుకుంది. అంతకంటే తను చెయ్యగలిగిందేమిటో అర్థబలం, అంగబలం లేని ఆమెకి తెలియలేదు. వెంకట్రామయ్య యెలా రెండు సంసారాలు సంభాళించుకు వచ్చేవాడో తెలీదుగాని అటు రుక్మిణమ్మగాని, యిటు వనజగాని ఆయన బ్రతికున్న కాలంలో ఆర్థికంగా చికాకులు పడలేదు. వనజకి తిండికీ బట్టకీ లోటు లేకుండా గడిచిపోయింది. అలాగే జీవితం గడిచిపోతుందనుకున్న వనజకి హఠాత్తుగా ఆయన గుండె పోటుతో మరణించడం పెద్ద అఘాతమే అయింది.



ఎందుకు ?

"శ్రీమతి మరియు శ్రీ గోపాలరావుగార్లు సరదాగా అలా కాష్మీర్ తిరిగి రావడానికి విమాన ప్రయాణం పెట్టుకున్నారు. తీరా విమానాశ్రయం చేరుకున్న తర్వాత శ్రీ గోపాలరావు 'అరె .... మనతో మన బీరువా కూడా తెస్తే బాగుండేదే?' " అన్నాడు.

"ఎందుకూ?" కోపంగా చూస్తూ అడిగింది శ్రీమతి గోపాలరావు.

"టిక్కట్లు అందులో మరచిపోయాను'

ఆమెకి భర్త పోయేడూ అనేకంటే ముందు జీవితం యెలా గడుస్తుందీ అన్న బెంగ పట్టుకుంది. ఇంతకు ముందులాగ ఆమె వొక్కర్తే అయితే ఆమె అంత బెంగ పడకపోను. కాని యిప్పుడు ఆమె ముందు యేడాది కొడుకు భవిష్యత్తు వుంది. వెంకట్రామయ్యతో ఆమె వచ్చేసిన నాడే ఆమెకీ, అన్నకీ అంతంతమాత్రంగా వున్న సంబంధాలు తెగిపోయాయి. అటునించి యే సాయమూ లేదన్న సంగతి ఆమెకి యేనాడో స్పష్టమైపోయింది. ఒక బలహీన క్షణంలో ఆమె "వీడిని తీసుకెళ్ళి ఆ రుక్మిణమ్మ కాళ్ళమీద పడేద్దునా? ఎంతయినా తమ వంశంలోనివాడు, ఆదరించకపోతుందా?" అని కూడా అనుకుంది. ఆమె యేం చెయ్యడానికీ తోచక గుజ్జుమజ్జులు పడుతూ, యింట్లో వున్న చెంబూ, తపేలా అమ్మి కాలం గడుపుతున్న రోజుల్లో, యిల్లుగలావిడ,

"అలా యేడుస్తూ కూర్చుంటే కష్టాలు తీరిపోతాయా? ఆ రుక్మిణమ్మ చూడూ, ఆయన పని చేసిన ఆఫీసుకి వెళ్ళి వేలకి వేలూ తెచ్చుకుంటోందట! కొడుకుకి వుద్యోగం కూడా ఆవబోతోందని అనుకుంటున్నారు. ఈ వేడి చల్లారకముందే, నువ్వూ యేదైనా ప్రయత్నం చేసుకో!" అంటూ సలహా యిచ్చింది. ఆ మాటతో వనజకి తన కర్తవ్యం గుర్తుకొచ్చినట్టయింది.

*

"ఏమిటీ? మీరు ఆయన భార్యా? ఆయన భార్య రుక్మిణమ్మ మొన్ననే వచ్చి...." అంటున్న ఆఫీసు గుమాస్తా మాటలకి అడ్డుపడుతూ వనజ.

"నేను ఆయన రెండో భార్యని! వీడు ఆయన కొడుకు!" అంది కొంచెం తడబాటుతో, అతను తెరవబోతున్న లెడ్జర్‌ని మూసేస్తూ.

"అలా చెప్పండి మరి! నేను యిదేమిటా? ఎక్కడ పొరపాటు జరిగిందా? అని ఆలోచిస్తున్నాను. చూడండమ్మా! మీరు చూస్తే కొద్దిగా చదువుకున్న మనిషిలా వున్నారు. కేంద్రప్రభుత్వంలో పని చేసే వుద్యోగి, భార్య బ్రతికివుండగా మళ్ళీ పెళ్ళి చేసుకోవడం నేరమనీ, ఆ నేరంలో మీరూ భాగస్తులనీ, ఒక వేళ అలా చట్టం కళ్ళుకప్పి చేసుకున్నా ఆ పెళ్ళి చెల్లదనీ, ఆ భార్యకిగాని, ఆ సంతానానికిగాని, ప్రభుత్వం చనిపోయిన వుద్యోగి కుటుంబానికి అందజేసే సహాయంలో యెలాంటి హక్కూ వుండదనీ మీకు తెలీదా? లేక తెలిసే మీరీ పొరపాటు చేశారా?" అని అడుగుతూ వుంటే వనజకి కాళ్ళక్రింది భూమి కదలిపోతున్నట్టనిపించింది. కన్నీళ్ళతో మసకబారిపోతున్న కళ్ళకి దూరంగా భవిష్యత్తులో భూషయ్యగారి బట్టలకొట్టు మాత్రం కనిపించసాగింది. □